క్లుప్తంగా

వెంకటాచలంలో మంత్రి ఎన్నికల ప్రచారం నేడు

వెంకటాచలం : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం వెంకటాచలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య శనివారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు వివిధ కాలనీల్లో ప్రచారం చేస్తారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

మొండి బకాయిదారులపై చట్టపరమైన చర్యలు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్‌కు పన్నులు బకాయి ఉన్న వారిని ఉపేక్షించబోమని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ వికాస్‌మర్మత్ హెచ్చరించారు. శనివారం ఆయన ఏబీఎం కాంపౌండ్ నిర్వాహకులను కలుసుకుని పన్ను బకాయిలపై ప్రత్యక్షంగా వివరణ కోరారు. 1999–2000 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు అసలు వడ్డీ కలిపి ఏబీఎం సంస్థ రూ.67 లక్షలు బకాయి ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నెలాఖరు వరకు ఆస్తి పన్నుపై వడ్డీమాఫీ అవకాశాన్ని కల్పిస్తోందని, ఏక మొత్తంలో రూ.20 లక్షలు చెల్లిస్తే దాదాపు రూ.47లక్షలు మినహాయింపు లభిస్తుందన్నారు. మంగళవారంలోపు చెల్లించాలని సంస్థ కస్టోడియన్ మహిమాంబకు కమిషనర్ సూచించారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెలవు దినాల్లో సైతం పన్నుల చెల్లింపు కేంద్రాలను నడుపుతున్నామని, నగర ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు కమిషనర్ శర్మద, రెవెన్యూ అధికారి శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ అజయ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు కేవీ చలమయ్య కన్నుమూత


చలమయ్య(ఫైల్)


నెల్లూరు(బృందావనం): ప్రముఖ గాంధేయవాది, స్వాతంత్య్ర సమరయోధుడు కొన వెంకట చలమయ్య (89) శనివారం వేకువన సంతపేటలోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. నెల్లూరుకు రెండు పర్యాయాలు వచ్చిన గాంధీని తన బాల్యంలో వీక్షించిన చలమయ్య గాంధేయ మార్గాన్ని అనుసరించారు. అప్పట్నుంచి మరణించే వరకు అదే బాటలో కొనసాగారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములుతో ఆయన ఎంతో సన్నిహితంగా ఉండేవారు. మాజీ సీఎం కొణిజేటి రోశయ్యకు ఆప్తమిత్రులుగా మెలిగారు. కాగా చలమయ్య మరణ వార్త తెలియగానే వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సంతపేటలోని ఆయన స్వగృహానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఘనంగా అమరవీరుల దినోత్సవం


డీసీఓ కార్యాలయంలో అమరవీరులకు నివాళి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జిల్లా సహకార శాఖ అధికారి(డీసీఓ) కార్యాలయంలో అమరవీరుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. డీసీఓ గురప్ప ఆధ్వర్యంలో దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం ఉద్యమించిన భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ను బ్రిటీష్ వారు 1931 మార్చి 23న ఉరి తీశారని తెలిపారు. వారి త్యాగానికి గుర్తుగా మార్చి 23వ తేదీని అమరవీరుల దినోత్సవంగా ప్రకటించడం జరిగిందన్నారు. డీసీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో..


బీసీ వసతిగృహంలో...

భగత్‌సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం(ఆర్‌ఎస్‌యూ) ఆధ్వర్యంలో నగరంలోని బీసీ వసతి గృహంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మునిరెడ్డి, కార్యదర్శి పణీంద్ర, వెంకటేష్, తేజ, రవి, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 5, 6, 7, 8 తరగతుల్లో అడ్మిషన్ల కోసం ఆసక్తి ఉన్న విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఆత్మకూరు ఏపీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ టి కామేశ్వరి శనివారం తెలిపారు. జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం, డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు మార్చి 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని ఆమె వివరించారు. ఏప్రిల్ 25న ప్రవేశ అర్హత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చంద్రబాబును ప్రజలు నమ్మరు


ఫ్యాన్ను చూపిస్తూ ప్రచారం చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• ఎన్నికల ప్రచారంలో మంత్రి కాకాణి

ముత్తుకూరు : వందల హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేసిన టీడీపీ అధినేత చంద్రబాబును ప్రజలు ఎట్టి పరిస్థితిలోనూ నమ్మరని రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పైనాపురం, నేలటూరు పంచాయతీల్లో మంత్రి కాకాణి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 2014లో ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి అధికారంలోకి రాగానే తన కుమారుడు లోకేష్‌కు మాత్రం ఎమ్మెల్సీ, మంత్రి పదవులు ఇచ్చుకున్నాడని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని గుర్తుచేశారు.

బాబుకు గ్యారెంటీ లేదు

బాబు షూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ అంటూ అటు చంద్రబాబు, ఇటు సోమిరెడ్డి పర్యటనలు చేశారని, అయితే, రాబోయే ఎన్నికల్లో ఇద్దరికీ గ్యారెంటీ లేదని కాకాణి వ్యంగ్యంగా అన్నారు. హామీలిచ్చి మోసం చేసే చంద్రబాబు కావాలా, ఇచ్చిన హామీలను నెరవేర్చే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలా నిర్ణయించుకునే సమయం ఆసన్నమైందన్నారు. కరోనా కష్టకాలంలో పేదలకు రూ.3 కోట్ల విలువైన బియ్యం, పామాయిల్ ఇచ్చి ఆదుకున్న విషయం గుర్తుచేశారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.


అంబేడ్కర్ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న మంత్రి కాకాణి

స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు

ప్రాజెక్టుల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇచ్చి తీరాలని మంత్రి కాకాణి అన్నారు. థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన కుటుంబాల వారికి తప్పకుండా ఉద్యోగాలు కల్పించి తీరుతామన్నారు. అల్లీపురంరెడ్డి(సోమిరెడ్డి) సర్వేపల్లిని అన్నిరకాలుగా దోచుకున్నాడని అన్నారు. తాము మత్స్యకారేతర ప్యాకేజీ సాధించి ప్రతి కుటుంబానికి రూ.25 వేలు పంపిణీ చేయించామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధనరెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్, నాయకులు మునుకూరు రవికుమార్‌రెడ్డి, శీపారెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ఈపూరు కోటారెడ్డి, సర్పంచ్ విజయకుమార్, ఎంపీటీసీ సభ్యుడు శివ, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట నేడు


కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం

ముత్తుకూరు : మండలంలోని తాళ్లపూడి పంచాయతీ కప్పలదొరువులో నూతనంగా నిర్మించిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం విగ్రహ ప్రతిష్టకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 22వ తేదీ నుంచి మొదలైన ఆలయ శిలాబింబ జీవధ్వజ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాలు పూర్తయ్యాయి. విగ్రహ ప్రతిష్ట కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

కాకాణి విజయం ఖాయం

• వైఎస్సార్‌సీపీ నాయకులు


మరుపూరు వద్ద పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

పొదలకూరు : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి నుంచి హ్యాట్రిక్ విజయం సాధిస్తారని సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వేణంబాక చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పొదలకూరు ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కాకాణి గెలుపు కోసం పొదలకూరు శివాలయం నుంచి గొలగమూడి వరకు శనివారం పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రను ప్రారంభించిన నాయకులు మాట్లాడుతూ సర్వేపల్లి నుంచి కాకాణి రెండు పర్యాయాలు టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డిపై విజయం సాధించారన్నారు. మూడో పర్యాయం కూడా కాకాణిదే విజయమని అన్నిరకాల సర్వేలు వెల్లడిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. కాగా మార్గమధ్యలో మరుపూరు వద్ద పార్టీ నేతలు యాత్రను స్వాగతం పలికారు. పాదయాత్ర దిగ్విజయంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వి.గోపాల్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులురెడ్డి, పొదలకూరుకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాకాణి అభిమానులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు

• ఎంపీడీఓ మహ్మద్‌రఫీ



పొదలకూరు : మండల పరిధిలో ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఎంపీడీఓ మహ్మద్‌రఫీ పేర్కొన్నారు. ఆయన శనివారం మాట్లాడుతూ కోడ్ అమలులోకి వచ్చిన 48 గంటల్లోనే మండల పరిధిలో పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగించామని, విగ్రహాలకు ముసుగులు వేసినట్లు వెల్లడించారు. మారుమూల గ్రామాల్లో సైతం ఫిర్యాదులు అందిన వెంటనే సచివాలయ ఉద్యోగులను అప్రమత్తం చేసి ఫ్లెక్సీలను తొలగించామని పేర్కొన్నారు. శిలాఫలకాలకు ఉన్న మూడు రంగులకు కూడా సున్నం వేయించినట్లు చెప్పారు. ప్రభుత్వ భవనాలపై అభ్యంతరకర పెయింటింగ్స్ ఉంటే వెంటనే సున్నం వేయిస్తున్నామని, సీ–విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులకు వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అయితే కొందరు ఉద్దేశపూర్వకంగా సీ–విజిల్ యాప్‌కు ఫిర్యాదు చేస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి పోలీసు కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమలుకు రాజకీయ నాయకులు సహకరించాల్సిందిగా కోరారు.

నేత్రపర్వం.. కల్యాణం


ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవారు

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామంలో ఉన్న రుక్మిణి సమేత పాండురంగస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామికి పంచామృత అభిషేకం, హోమం, మంగళ హారతి, తీర్థప్రసాద వితరణ, మధ్యాహ్నం గిన్నెభిక్ష గ్రామోత్సవం, సాయంత్రం ధ్వజారోహణ, రాత్రి హోమం, నైవేద్యం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం జరిగింది. చివరగా జిల్లా స్థాయిలో పండరి భజన పోటీలను నిర్వహించారు.

ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్సై అజయ్‌కుమార్

మనుబోలు : మండల పరిధిలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను పక్కాగా చేస్తున్నట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. మండలంలో మొత్తం 42 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలియజేశారు. వీటిల్లో వసతులు ఎలా ఉన్నాయి.. తదితర బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. గత ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండలంలోని మడమనూరు, వెంకన్నపాళెం, వీరంపల్లి గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించినట్లు తెలిపారు.

ఈ గ్రామాల్లో అదనపు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి గొడవలు, వివాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



సేంద్రియ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి

వెంకటాచలం : మండలంలోని కాకుటూరులో వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆరో రోజు శనివారం రైతులకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగం వల్ల ఖర్చు పెరగడమే కాకుండా, తెగుళ్లు అధికమవుతాయని వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి రైతులకు వివరించారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల పంట నాణ్యతతో పాటుగా, దిగుబడులు పెరుగుతాయని తెలియజేశారు. ప్రతి రైతు తప్పనిసరిగా అవగాహనతో వ్యవసాయం చేస్తే ఆర్థికంగా మెరుగుపడుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బిరదవోలులో ఇంటింటి ప్రచారం


ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పొదలకూరు : మండలంలోని బిరదవోలు పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మూడో రోజు శనివారం పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఓటు వేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ప్రజలు ఓట్లు వేయాలని కోరారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం


ఆత్మకూరులోని స్కానింగ్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న వైద్య బృందం

ఆత్మకూరు: ప్రభుత్వ నిబంధనల మేరకు ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వివరాలను బహిర్గతం చేయడం తీవ్ర నేరమని డివిజనల్ మెడికల్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎస్‌వీ సుధీర్‌కుమార్ తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని పలు ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో శనివారం పీడియాట్రిక్స్ డాక్టర్ దినకర్, పీహెచ్‌సీ డాక్టర్ అనూషతో కలిసి ప్రోగ్రామ్ అధికారి సుధీర్‌కుమార్ స్కానింగ్ సెంటర్లను పరిశీలించారు. ఇటీవల జరిగిన పరీక్షల రికార్డులను తమకు అందిన నివేదికలను సరిపోల్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షల అనంతరం ఆ నివేదికలను ఎట్టి పరిస్థితుల్లోనూ బహిర్గతం చేయరాదన్నారు. కేవలం గర్భంలోని శిశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహించే పరీక్షలను కొందరు బహిర్గతం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆస్పత్రుల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో వెంకయ్యస్వామి

మనుబోలు : మండల పరిధిలోని మనుబోలు–చెర్లోపల్లి రైల్వే గేటు సమీపంలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు వెంకయ్యస్వామికి క్షీర, పంచామృతాభిషేకాలను శాస్త్రోక్తంగా జరిపించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య విశేష పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కలికి వినీల్‌రెడ్డి, వైష్ణవి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

చంద్రబాబు జీవితం ప్రజలకు అంకితం


మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

వెంకటాచలం: చంద్రబాబు జీవితం రాష్ట్ర ప్రజలకు అంకితమని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా మండలంలోని పుంజులూరుపాడు, కురిచెర్లపాడు గ్రామాల్లో ఆమె శనివారం పర్యటించారు. పలు కుటుంబాలతో మమేకం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబుకు తన కుటుంబ సభ్యుల కంటే రాష్ట్ర ప్రజల బాగోగులు చూడాలని ఎప్పుడూ పరితపిస్తుంటాడని తెలియజేశారు. అందరూ కలిసికట్టుగా రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఆమె వెంట సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పౌష్టికాహార వినియోగం తప్పనిసరి


విడవలూరు: బాలింతలు, గర్భిణులతో అంగన్‌వాడీ సిబ్బంది

ఇందుకూరుపేట : ప్రతి మనిషికి పౌష్టికాహారం తప్పనిసరి అని, గర్భిణులు, బాలింతలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. ఇందుకూరుపేట ప్రాజెక్ట్ పరిధిలో పోషణ్ పక్వాడ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజున కొరుటూరులో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మన ఆహారంలో చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు గురించి విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం నివారణే లక్ష్యం

కొడవలూరు: పౌష్టికాహార లోపాన్ని పూర్తిగా నివారించడమే అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల స్పష్టం చేశారు. కొడవలూరులోని ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ ఒక్క చిన్నారి కూడా పోషకాహార లోపంతో బాధపడకూడదన్నారు. ప్రభుత్వం ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన మేర పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో తల్లీబిడ్డ ఆరోగ్యకరంగా ఉన్నారా.. లేదా? పరిశీలించుకోవాల్సిన బాధ్యత అంగన్‌వాడీలపై ఉందన్నారు. ఇందుకోసం ఆరోగ్య సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు యాస్మిన్, నాగరాజ, కామేశ్వరి, శాంతి, రమీజా, అఫ్రిన్ పాల్గొన్నారు.

అగచాట్లపురంలో..

పొదలకూరు : పట్టణంలోని అగచాట్లపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి సమావేశానికి హాజరైన గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాల వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. మాంసకృతులు, విటమిన్లు, ఖనిజ లవణాలు చిరుధాన్యాలలో ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్‌ఖాదర్, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, సుమతి, జయమ్మ, ప్రవీణ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఇందుకూరుపేట: కొరుటూరులో పోషణ్ పక్వాడ

తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఆహారం

విడవలూరు: తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమై ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడమే పక్వాడ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ బి.రమణి అన్నారు. మండలంలోని ఊటుకూరు సెక్టార్ అన్నారెడ్డిపాళెం పంచాయతీ భద్రాచలం గ్రామంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహార ప్రాముఖ్యత, పరిశుభ్రత గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎమ్.తిరుపతమ్మ, వి.అరుణమ్మ, జి.ఎస్తేరమ్మ, కె.కామాక్షమ్మ, పి.వరలక్ష్మి, ఆర్.విజయమ్మ, వి.ప్రశాంతి పాల్గొన్నారు.


పొదలకూరు : మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్


కొడవలూరు : అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదలకూరు : మండలంలోని ప్రభగిరిపట్నం, విరువూరు, తాటిపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో వరుసగా ఆది, సోమవారాలు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పొదలకూరు విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ శనివారం తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల పరిధిలో మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.